# సత్యవాక్య

# The Word of Truth

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్య వాణి' యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలుపొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులభముగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి !!

**SATYAVANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA–533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం !!

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

పోస్ట్ బాక్స్ - 80, కాకినాడ - 533 001

ఎడిటర్ : జె. సి. ఛోటే

మేనేజింగ్ ఎడిటర్ : జాషువా గూటం

సంచిక 2 సెప్టెంబరు 1983 సంపుటి 4

## సంపాదకీయము

### "మీరేమి అడుగుచున్నారో మీకు తెలియదు"

*( Ye Know Not What Ye Ask )*

మత్తయి 20:20-29 లో ఇట్లు వ్రాయబడి యున్నది : "అప్పుడు జెబెదయి కుమారుల తల్లి తన కుమారులతో ఆయన యొద్దకు వచ్చి నమస్కారముచేసి యొక మనవి చేయబోగా, నీవేమి కోరుచున్నావని ఆయన అడిగెను. అందుకామె, నీ రాజ్యమందు ఈ నాయిద్దరు కుమారులలో ఒకడు నీకుడివైపునను ఒకడు నీ యెడమవైపునను కూర్చుండ సెలవిమ్మని ఆయనతో అనెను. అందుకు యేసు - మీరేమి అడుచుచున్నారో అది మీకు తెలియదు, నేను త్రాగబోవు గిన్నెలోనిది మీరు త్రాగగలరా ? అని అడుగగా వారు త్రాగగలమనిరి. ఆయన మీరు నా గిన్నెలోనిది త్రాగుదురుగాని నా కుడివైపునను నా యెడమవైపునను కూర్చుండ నిచ్చుట నా వశమునలేదు; నా తండ్రిచేత ఎవరికి సిద్ధపరచబడెనో వారికే అది దొరుకునని చెప్పెను. తక్కిన పది మంది శిష్యులు ఈ మాట విని ఆ యిద్దరు సహోదరులమీద కోపపడిరి.

గనుక యేసు తన యొద్దకు వారిని పిలిచి - అన్యజనులలో అధికారులు వారిమీద ప్రభుత్వము చేయుదురనియు, వారిలో గొప్పవారు వారి మీద అధికారము చేయుదురనియు మీకు తెలియును. మీలో ఆలా గుండకూడదు; మీలో ఎవడు గొప్పవాడై యుండగోరునో వాడు మీకు పరిచారకుడై యుండవలెను. మీలో ఎవడు ముఖ్యుడై యుండగోరునో వాడు మీకు దాసుడై యుండవలెను. ఆలాగే మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచనక్రియ ధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని చెప్పెను."

మత్తయి 4:21 ని బట్టి యాకోబు యోహానులను వారు జెబెదయి కుమారులని మనము తెలుసుకోగలము. ఇక్కడ జెబెదయిని గూర్చి ఏమి చెప్పబడలేదు. అయితే ఈ సందర్భములో యాకోబు యోహానుల తల్లి ఆయన యొద్ద ఒక మనవి చేయుటకు వచ్చినది. యేసు రాజ్యములో తన కుమారులలో ఒకడు ఆయన కుడివైపునను, ఇంకొకడు ఎడమవైపునను కూర్చుండ సెలవియ్యమని ఆమె ఆయన నడిగింది. ఈ తల్లి తన పిల్లల దరపున మాట్లాడుచున్నది. రాజ్యంలో వారు ప్రముఖస్థానాలను ఆక్రమించుకోవాలని ఆమె కోరింది. క్రీస్తు స్థాపించుటకు వచ్చిన రాజ్యం ఆత్మీయమైనది. అది అప్పటి కింకను స్థాపింపబడలేదు. అయితే ఈ తల్లి అనుకొనినదంతా బహుశా భౌతిక రాజ్యం, ఇశ్రాయేలీయులకు పునరుద్ధరింపబడి క్రీస్తుచే పరిపాలింపబడు ననుకొన్న రాజ్యం అయ్యుండవచ్చు. ఎలాగయినా ఆమె అడిగిన దంతా అధికారం చెలాయించే స్థానాలు.

అట్టి దాన్ని కోరడంలో మనం ఈ స్త్రీని ఎక్కువ నిందించ లేము. ఏలయనగా మీరేమి అడుగుచున్నారో అది మీకు తెలియదని యేసు చెప్పాడు. ఇశ్రాయేలీయుల భౌతిక రాజ్యానికి, క్రీస్తు స్థాపించు టకు వచ్చిన ఆత్మీయ రాజ్యమగు సంఘానికిగల వ్యత్యాసాన్ని ఆమె

నిజంగా గ్రహించుకోలేదు (మత్తయి 16:18). స్వార్థపరమైన కోరికను కోరుచున్నానని ఆమె తలంచలేదు. తన కుమారులకు మానవజాతి గర్వానికి సూచకమైన ఘనత మహిమలు కోరుచున్నానని బహుశ ఆమె తలంచి యుండ లేదు. తండ్రి ఒక్కడు మాత్రమే అనుగ్రహించగల స్థానాలను ప్రభువును అడుగుచున్నట్లు ఆమె గ్రహించలేదు. క్రీస్తే దేవుని కుడిపార్శ్వమున కూర్చుండును. ఆస్థానాన్ని ఆయన మరింకెవనితోను పంచుకోడు.

ఈ విషయాన్ని గూర్చి కోపం తెచ్చుకొనక యేసు కొన్ని ప్రశ్నలడిగాడు. నేను త్రాగబోవు గిన్నెలోనిది మీరు త్రాగగలరా? నేను పొందబోవు బాప్తిస్మమును మీరు పొందగలరా? అని ఆయన వారి నడిగాడు. సహజంగా అవునని వారు జవాబిచ్చారు. ఎందువలనంటే యేసు దేన్ని గూర్చి మాట్లాడుచున్నాడో వారికి నిజంగా తెలీదు. త్వరలో సంభవింపబోవుదాన్ని గూర్చి, అంటే ఆయన సిలువపై పొందబోవు శ్రమలు మరణాన్ని గూర్చి క్రీస్తు మాట్లాడాడు (లూకా 12:50). వారాయన కొరకు తమ ప్రాణముల నర్పించుట సాధ్యమే అయినను వారి కోరికను నెరవేర్చుట ఆయనకు సాధ్యం కాదని యేసు అంగీకరించాడు.

ఈ సంఘటనను గూర్చి మిగిలిన శిష్యులు కోపపడిరి. అయితే ఇటువంటి మన స్తత్వము ఈ లోకప్రజలకు సహజమనియు అయితే తన శిష్యులలో గొప్పవాడుగా యుండగోరువాడు వారందరికి దాసుడై యుండాలని, ముఖ్యుడై యుండగోరువాడు పరిచారకుడై యుండాలని వారికి వివరించి వారిని క్రీస్తు ప్రభువు చల్లార్చాడు. దీన్ని గూర్చి ఒక ఉదాహరణగా ఆయనే పరిచారము చేయించుకొనుటకుగాక, పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయ ధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చితినని చెప్పాడు.

ఈ సందర్భములోనుండి మనం అనేక పాఠములను నేర్చుకొన

వచ్చును గాని మీరేమి అడుగుచున్నారో అది మీకు తెలియదు అని యేసు చెప్పిన మాటలను మీరు గమనించ గోర్తాను. ప్రార్థనద్వారా ప్రభువును అనేక సంగతులను అడుగు ఈనాటి ప్రజలకు కూడ ఈ మాటలు వర్తించును. ఉదాహరణకు కొందరు పరిశుద్ధాత్మ యొక్కయు అగ్ని యొక్కయు బాప్తిస్మము కొరకు ప్రార్థన చేతురు. మరికొందరు అద్భుతంగా రోగులను స్వస్థపర్చాలని, వారితో ప్రభువు నేరుగా మాట్లాడాలని, వారు అన్యభాషలు మాట్లాడేటట్టు చేయాలని ప్రార్థింతురు. అట్టివారు ప్రభువుచేసిన బోధలను అపార్థము చేయుచున్నారు. క్రీస్తు, ఆయన అపొస్తలులు అద్భుతాలు చేసినందున వారుకూడా అద్భుతాలు చేయగల్గుదురని వారనుకొందురు. ఈనాడు క్రీస్తు ఆ యద్భుతాలను చేయలేడని గాని, లేక వాటిని చేసే శక్తిని ఆయన ఈ నాడు మనకీయలేడని కాదు గాని వాటిని చేయ కూడదని ఆయన నిశ్చయించుకొని యున్నాడు. పరిశుద్ధాత్మ బాప్తిస్మము విశ్వాసులందరికీగాక అపొస్తలులకుమాత్రమే వాగ్దానము చేయబడినది (యోహాను 16:13). అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందారు (అపొ.కా. 2:1-4). తరువాత వారు ఏర్పరచుకొన్న కొద్దిమంది అద్భుతములు చేయగల్గునట్లు వారిపై చేతులుంచారు (అపొ.కా. 6; 8). అప్పుడు అపొస్తలులు, వారు ఎవరిపై చేతులుంచిరో వారు అద్భుతములను చేసారు, వివిధ భాషలలో మాట్లాడారు. ఇదంతా వాక్యాన్ని స్థిరపర్చడానికి, విశ్వాసులను చేయడానికి వారు చేసారు (మార్కు 16:19, 20). మిగిలినవారందరు పరిశుద్ధాత్మ వరమును అనగా అనాద్భుత పరిమాణమైన పరిశుద్ధాత్మ వరమును పొందారు (అపొ.కా. 2:38) మనం సర్వసత్యములోనికి నడిపింపబడు నిమిత్తము దేవుని వాక్యము లిఖింపబడి మనకీయబడినది (హెబ్రీ 1:1, 2; యోహాను 20:30, 31; రోమా 10:17). గనుక పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిన వారెవరు ఈనాడు లేరు. అపొస్తలులవలె

అద్భుతములు చేయఁగలవారు, అన్యభాషలలో మాట్లాడువారు ఎవరు లేరు. ఈనాడు క్రొత్తగా ఈయబడిన బయల్పాటుగాని అద్భుత సంఘటనలుగాని ఏమీ లేవు. ఎవరైనా అట్టివాటిని గూర్చి ప్రభువును అడుగుచున్నట్లయితే వారేది అడుగుచున్నారో వారికి తెలియదు. అవిశ్వాసము, అజ్ఞానము, వంచనవలన దేవుని ఆయన వాక్యాన్ని నిరాకరించు వారొకానొక దినమందు అగ్నితో బాప్తిస్మము పొందుదురు. వారు అగ్నిగుండములో పడవేయబడుదురు (మత్తయి 3:11, 12; ప్రక 21:8).

పైన చెప్పబడిన తప్పుడు కోరికలతోపాటు, ఈనాడనేకులు ఈ లోకంలో యున్న అన్ని మతశాఖల గుంపులను దీవించుమని ప్రభువును కోరుదురు. అట్లు చేయడంలో ప్రభువు విభజనలను, గలిబిలిని, మానవ కల్పిత సిద్ధాంతములను దీవించాలని వారడుగుదురు. ఆయనను ఆయన మార్గాన్ని వ్యతిరేకించువారిని దీవించాలని వారడుగుదురు. దేవుని వాక్యం ఐక్యతనేగాని విభజనను బోధించుటలేదు (1 యోహాను 1:10; యోహాను 17:20-24). క్రీస్తు తన సంఘమును కట్టుదునని వాగ్దానం చేసాడు. ఆ సంఘము రెండువేల సంవత్సరముల క్రితం పెంతెకొస్తునాడు స్థాపించబడింది. అదే సంఘము ఇప్పటికింకను నిలిచే యున్నది. దాన్ని గూర్చినదంతయు లేఖనాల్లో మనం చదువుకో గలము. సంఘాన్నిగూర్చి బైబిలు చెప్పుచున్నదాన్ని గూర్చి యెవడును అజ్ఞానుడుగా యుండవలసిన కారణం ఏమియు లేదు. గనుక ప్రభువు వివిధ డినామినేషన్లను దీవించాలని అడుగుట ఆయన ఉపదేశానికి భిన్నముగా యున్నదాన్ని అడుగుటయే. అట్టి ప్రజలు నిజంగా వారేమి అడుగుచున్నారో వారికే తెలియదు.

క్రీస్తు సంఘసభ్యులమైన మనముకూడ అజ్ఞానమువలన మనకు తెలియని సంగతుల నడుగుచుండవచ్చును. ప్రార్థనద్వారా పరలోక తండ్రితో మాట్లాడే అవకాశము క్రైస్తవుడు కలిగియున్నాడు.

అయితే మన ప్రార్థన జ్ఞానయుక్తంగా యుండాలి. అందుకే ప్రభువా మాకు ప్రార్థన చేయుట నేర్పుమని శిష్యులు అడిగారు (లూకా 11:1). క్రైస్తవులుగా మనం అడిగేది ఆయన చిత్తానుసారముగా యుండాలి. యోహాను ఇట్లనుచున్నాడు: "ఆయనను బట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా, ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే. మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించునని మనమెరిగిన యెడల మనమాయనను వేడుకొనిన వి మనకు కలిగినవని యెరుగుదుము" (1 యోహాను 5:14, 15). తండ్రులవలె మన పిల్లలు అడిగిన దాన్ని యిచ్చుటలో మనకు సంతృప్తి కలుగును. అయినను మనం మన బిడ్డలను ప్రేమించిన యెడల వారడిగిన ప్రతి వస్తువును వారికి ఇయ్యముగదా. పిల్లలవలె వారికేది శ్రేష్ఠమో దాన్ని వారు గ్రహించలేక పోవచ్చును. తండ్రులకు పిల్లలకు ఉన్న గొప్ప వ్యత్యాసము యిది. అట్లే మనందరినీ ప్రేమించు తండ్రి యున్నాడు. మనం అజ్ఞానాన్ని బట్టి మనకేది శ్రేష్ఠమో దాన్ని ఆయనను అడుగకపోవచ్చు, లేక యేది శ్రేష్ఠం కాదో దాన్ని అడుగవచ్చు. మనకు శ్రేష్ఠమైన దాన్ని యిచ్చి ప్రభువు మనలను కాపాడును. అదే సమయమందు మనం ఆయన జ్ఞానమునందును భక్తియందును అభివృద్ధి జెంది జ్ఞానయుక్తంగా అడుగునట్లు మనం ఆయన వాక్యాన్ని చదివి ధ్యానిస్తూ యుండాలి. ఈ విధంగా ప్రభువు మన మనవి నాలకించి ప్రత్యుత్తరమీయగల్గునట్లు చేయగలం.

---

## క్రొత్త జన్మ

(గత సంచిక తరువాయి)

—పెరిక్లోతమ్

ఒకడు విశ్వసించునపుడు జనింపజేయబడును. దేవుని వాక్యమును వినుటవలన విశ్వాసము కలుగును గనుక (రోమా 10 : 17), విశ్వాసముంచినవాడు జనింపజేయబడినవాడు గనుక దేవుడు పుట్టించు

విధానమిది. పరిశుద్ధ లేఖనములగు వాక్యమువలన హృదయములో విశ్వాసము కలుగును. ప్రజలకు దేవుని వాక్యము బోధింపబడినపుడు వారు దానిని విశ్వసించినయెడల వారు దేవుని మూలముగా పుట్టిన వారగుదురు.

జనింపజేయబడుట క్రొత్త జన్మలో ఒక భాగమై యున్నది. జనింపజేయబడుట ఒక్కటి మాత్రమే భౌతిక జన్మ యెట్లు కాదో అట్లే క్రొత్తజన్మ కూడాను. ఒకడు తల్లి గర్భమందు పడగా జన్మించిన వాడెట్లు కాలేడో అట్లే విశ్వాసి ఆత్మీయముగా జనింపజేయబడగా ఆ సమయమందే అతడు తిరిగి జన్మించినవాడుకాడు. జనింపజేయబడి నప్పుడు దేవుని కుటుంబములోనికి జన్మింపవచ్చును. లేదా తిరిగి జన్మించుట కతడు తిరస్కరించవచ్చును. (ఈ విషయములో భౌతిక ఆత్మీయ జన్మలకు తేడా కలదు. భౌతిక జన్మలో ఒకడు తిరస్కరించే అవకాశము లేనేలేదు). ఒకడు విశ్వసించినపుడు అనగా ఆత్మీయముగా జనించినపుడు అతడు దేవుని కుమారుడయ్యే తరుణమును కలిగి యున్నాడు. "ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను; ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు. తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన నామమందు విశ్వాసముంచిన వారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను. వారు దేవునివలన పుట్టినవారేగాని, రక్తమువలననైనను శరీరేచ్ఛవలననైనను మానుషేచ్ఛ వలననైనను పుట్టినవారుకారు" (యోహాను 1:11-13).

దేవుని పిల్లలగుటకు అధికారము కలవారు దేవుని పిల్లలు అప్పుడే కాలేరను సంగతి అందరికి గోచరమే. గనుక మనుష్యుడు విశ్వాస మూలమున మాత్రమే రక్షింపబడజాలడు (యాకోబు 2:24; యోహాను 12:42, 43).

పుట్టుటకుముందు పుట్టించుట అన్ని సందర్భములలో జరిగినను, ఒకడు గర్భములో పడినను (జనింపజేయబడినను) జీవించకపోవచ్చును.

గర్భములో పడిన తరువాత జనన మిచ్చుట జరుగవలెను. గనుక ఒకడు ఆయన నామమందు విశ్వసించినంత మాత్రముననే అతడు దేవుని కుమారుడు కాడు. శరీరమూలముగా జన్మించినది, ఆత్మమూలముగా జన్మించినది యను పదములను అందుకే నీకొదేముతో మాట్లాడుచు యేసు గర్భమందు పడినది మొదలుకొని జనన మయ్యేవరకు గల సందర్భమును వివరించుటకు చెప్పెను. గనుక ప్రతి క్రొత్త జన్మలోను మొదట జనింపజేయబడుట అటుతరువాత జన్మ నిచ్చుట సంభవించును.

## నీటి మూలముగా జన్మించుట

క్రొత్తగా జన్మించుటకు నీటిమూలముగా జన్మించవలెను. నీటి మూలముగా జన్మించుటయనగా బాప్తిస్మము పొందుట. దేవుని రాజ్యములో ప్రవేశించే విధానము ఒక జన్మగా పోల్చబడినను ఇందులో నీరు, ఆత్మ యనునవి అలంకారరీతిగా వినియోగించ బడలేదు. నీరు ఆత్మ యనునవి వాటి భావమును తెలుపు పదములుగా అనగా నీరు ఆత్మయనియే వినియోగింపబడెను. ప్రభువు నీరు, ఆత్మ యను పదముల నుపయోగించినప్పుడు వాటి భావమును నీకొదేము గ్రహించుకొన లేదను సూచనలేమియు వారి సంభాషణలో లేవు. బాప్తిస్మమును గూర్చిన అసత్యబోధ ఇప్పుడు ఎక్కువగా యున్నందున తప్ప యోహాను 3 : 5 ను ఎవరైనను చదివి అక్కడ క్రీస్తు నీరు, ఆత్మలను గూర్చియే చెప్పెనను సంగతిని యెవరు కాదనలేరు. నీరు అను మాట యోహాను 2 : 7, యోహాను 3 : 23 లో వినియోగింపబడెను. నీరనగా నీరు అనియే దాని భావము. అయితే యోహాను 3.5 లో నీరు అను పదము యొక్క భావము నీరు కాదని కొందరు చెప్పుదురు.

నీరు అనగా ఆత్మ యని కొందరు చెప్పుదురు. అట్లయిన ఆవచనము ఇట్లుండవలెను: "ఒకడు ఆత్మమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడు!" ఇ

బహు విపరీతమైనది! నీరు, ఆత్మల యొక్క భావము ఒక్కటే అయితే క్రీస్తు ఆ మాటలను అనవసరముగా పల్లించునా? నీరు ఆత్మలు ఒక్కటే కాదు. అల్లే నీరు ఆత్మయొక్క గుర్తుకాదు. నీరు దేవుని వాక్యమునకు గురుతుగా యున్నదని కొందరు చెప్పుదురు. అట్లయిన అది ఎఫెసీ 5 : 27 కు విరుద్ధముగా యున్నది. అక్కడ సంఘము "వాక్యముతో ఉదక స్నానముచేత పవిత్ర పరచబడినట్లు" పౌలు చెప్పెను. అది వాక్యముతో లేక వాక్యము వలన జరిగిన ఉదకస్నానమైన యెడల అవి రెండును ఒక్కటే కాజాలవు. యోహాను 4 : 10; యోహాను 7 : 38 లో యున్న రీతిగ అది జీవ జలమని చెప్పుటకు కొందరు ప్రియత్నింతురు. ఈ భావమును ప్రకటన 22 : 17 తిరస్కరించుచున్నది. జీవ జలము అను మాటకు తిరిగి జన్మించిన వారనుభవించు క్రీస్తు నందలి ఆత్మీయాశీర్వాదములని యర్థము. ఏ వచనములోనైన నీరు లేక జలము అను పదము అలంకార రీతిగ వినియోగించ బడినప్పుడు దానిని వర్ణించు పదముకూడ ఉపయోగింప బడెను. యేసు నీకొదేముతో ఒకడు జీవపు నీటి మూలముగా జన్మించవలెనని చెప్పలేదు; గాని ఆయన సూక్ష్మముగా నీటి మూలముగా జన్మించవలెనని చెప్పెను.

నీటిమూలముగా జన్మించుట యనగా అది భౌతిక జన్మను, ఆత్మ మూలముగా జన్మించుట యనగా అది క్రొత్త జన్మను సూచించుచున్నవి యని సాధారణముగ కొందరు బోధింతురు. యేసుయొక్క మాటలలో ఈ సిద్ధాంతము ఏకీభవించుటలేదు. "ఒక శిశువు నీటి మూలముగాను, ఒక మనుష్యుడు ఆత్మమూలముగాను జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యములో ప్రవేశింపలేడు" అని క్రీస్తు చెప్పలేదు. "ఒకడు (ఒక మనుష్యుడు) నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని" ఆయన చెప్పెను. భౌతికజన్మ యోహాను 3:5 లో చెప్పబడిన నీటిజన్మ కాదు.

నీకొదేము తన తల్లిదండ్రులకు జన్మించెను. అది భౌతికజన్మ; కాని ఇప్పుడు అతడు తిరిగి జన్మించవలెనని అనగా భౌతికముగా కాదుగాని నీటిమూలముగాను ఆత్మీయ మూలముగాను దేవుని రాజ్యములో పౌరుడగుటకు జన్మించవలెనని క్రీస్తు అతనికి చెప్పెను. ఒక శిశువు ఏలాగు జన్మించగలడని నీకొదేము అడుగలేదుగాని 'ముసలివాడైన మనుష్యుడేలాగు జన్మింపగలడు?' అని యడిగెను. అతడు నీటిమూలము గాను, ఆత్మమూలముగాను జన్మింపగలడనునది దాని జవాబు.

కొందరికి నీరు నీరుగా ఎందుకు అర్థము కాదంటే అది రక్షణ పొందుటకు బాప్తిస్మమును అత్యవసరముగా చేయుచున్నది. క్షమాపణ నొందుటకు బాప్తిస్మము అత్యవసరమైన దేవుని షరతు అని వారు నమ్ముటకు ఇష్టపడరు. అయితే ఇందులో నీరు అను పదమునుబట్టి క్రీస్తు బాప్తిస్మమును సూచించుటలేదని చెప్పు సిద్ధాంత మేదయినను అది తప్పుదారిని పట్టించుచున్నది. క్రీస్తుయొక్క ఆజ్ఞనుబట్టి దేవుని రాజ్యములో యున్న దీవెనలు పొందునిమిత్తము బాప్తిస్మము అత్యవసరముగా చేయబడినది.

యోహాను 3:5 లో సూచించబడిన బాప్తిస్మమును కాదనకుండ చేయు ప్రయత్నములు ఆధునికమైనవి. ఈ మధ్యవరకు నీటిమూ ముగా జన్మించుట యనగా బాప్తిస్మము పొందుటయని క్రైస్తవలో మంతయు అంగీకరించెను. అన్ని కాలములలోను యున్న అన్ని డినా మినేషన్ల పండితులందరు ఈ విషయమై ఏకీభావమును కలిగియున్నా రని నిజముగా చెప్పవచ్చును. అయితే ఈ వాస్తవమును తొలగించు ప్రయత్నము లన్నియు డినామినేషన్ల ద్వేషము చొప్పుననే ఉద్భవి చెను. గనుక యోహాను 3:5 లో చెప్పబడిన నీరు, నీటి బాప్తిస్మమునే సూచించుచున్నదనుటలో ఏ సందేహము లేదు. రక్షణార్థమై నీటిని వినియోగించు మత సంబంధమగు క్రియ బాప్తిస్మ మొక్కటే. క్రైస్

వ్యములో బాప్తిస్మములో తప్ప మరి యే క్రియలోను నీరు ఎన్నడు వినియోగించ బడలేదు.

## బాప్తిస్మము నీటి జన్మ

బైబిలు ప్రకారము బాప్తిస్మములో ఒకడు నీటిలో సంపూర్తిగా ముంచబడి దానిలో నుండి లేపబడును. అందువలనే యేసు బాప్తిస్మమును నీటిజన్మగా నుదహరించెను. ప్రభువు సమాధిలో పాతిపెట్టబడి దానిలో నుండి తిరిగి వచ్చెను. అందువలన ఆయన మృతులలో నుండి జన్మించెను. అందుకే మృతులలో నుండి ప్రథమ ఫలముగా క్రీస్తు లేపబడెనని పౌలు చెప్పెను (కొలస్స 1:18; 1 కొరింధి 15:20). సమాధిలో నుండి లేచుట యనగా మృతులలో నుండి జన్మించుట అయినప్పుడు నీటిలో నుండి లేచుటయనగా నీటిమూలముగా జన్మించుట యగును. దేవుని రక్షణ సంకల్పములో నీటిమూలముగా జన్మించుట యనగా నీటిలో ముంచబడుటయే తప్ప వేరొకటికాదు. బాప్తిస్మములో సమాధి పునరుత్థానము లున్నవి. తద్వారా ఒకడు నీటిలో ముంచబడి దానిలో నుండి బయటకు తీయబడును. లేఖనములను ఇప్పుడు గమనించుము: "కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడచుకొనునట్లు మనము బాప్తిస్మమువలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్ట బడితిమి" (రోమా 6 : 4).

బాప్తిస్మములో ఒకడు సంపూర్తిగా ముంచబడునని కొలస్స 2:12 లో మరింత విపులముగా యున్నది: "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి".

అందువలన నీటిమూలముగా జన్మించుట మరియు నీటిలో ముంచబడి నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు లేపబడుటయనునవి అనన్యముగా యున్నవి. కొన్ని నీటిచుక్కలు మాత్రమే వినియోగించ బడినపుడొక వ్యక్తి నీటిమూలముగా జన్మించుట అసాధ్యము. ఒకని నెత్తిమీద కొన్ని నీళ్ళు చిలకరింపబడి లేక కుమ్మరింపబడినయెడల ఆ వ్యక్తి బాప్తిస్మముద్వారా క్రీస్తుతో పాతిపెట్టబడియున్నానని నిజముగా చెప్పలేడు. పరిశుద్ధలేఖనములలో ప్రభువు అధికారము చొప్పున ఎన్నడయినను ఎందుచేతనయినను ఎవనిమీ నయినను నీరు ఒక్కటి మాత్రమే చిలకరింపబడలేదు. నీటిలో ముంచడము పొందనివాడు క్రొత్తగా జన్మించినవాడు కాదు.

పరిశుద్ధాత్ముని హెచ్చరికల ననుసరించుటవలన ఒకడు ముంచబడును. ఒకడు ఆత్మయొక్క వర్తమానమును విని విశ్వసించిన తరువాత అతడు ఆత్మయొక్క నడిపింపు చొప్పున బాప్తిస్మము పొందును: "మన మందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి" (1 కొరింథీ 12 : 13). విశ్వాసిని ఒక దశనుండి వేరొక దశకు మార్చుటకు బాప్తిస్మమును పరిశుద్ధాత్ముడు ఏర్పా చెను. ఆత్మయొక్క ఆజ్ఞలకు విధేయుడగుటలో ఒకడు నీటిమూలముగా జన్మించవలెను. గనుక ఆత్మమూలముగా జన్మించుటలో పరిశుద్ధమైన నూతన జీవిత సూత్రములలో మానవుని హృదయము పునరుత్పత్తి యగును. పాపపు ప్రేమ విసర్జించబడును. అట్టి వ్యక్తి దేవునికి సంపూర్ణ విధేయత చూపుటకు నిశ్చయించుకొని మరలును, నీటిలో ముంచబడి పరిశుద్ధ జీవితమును జీవించుటకొరకు లేపబడును. ఈ విధముగా ప్రజలు ఆత్మమూలముగా జన్మించుదురు. ఆత్మయొక్క నియమములను బట్టి క్రైస్తవులగుదురు (రోమా 8:2). ఈ పని యంతటిలోను కలుగు ప్రతి విధమైన మార్పు దేవుని ఆత్మవలన నడిపించబడును. ఆత్మీయ జన్మలోయున్న రెండు క్రియలలోను, అనగా జనిం

చేయుట, జన్మమిచ్చుటలోను పరిశుద్ధాత్ముడు దైవ సాధనమై యున్నాడు. ఆత్మ తన పనిని సాధించుటలో వినియోగించు సాధనము లిఖింపబడిన దేవుని వాక్యము. అందువలన ఆయన ప్రభావము వలన తిరిగి జన్మించినవాడు నిజానికి ఆత్మమూలముగా జన్మించినవాడు.

ముందు గమనించిన రీతిగా జన్మ ఒక మార్పు; అది పరిస్థితిలోను సంబంధములోను కలుగుమార్పు. తత్ఫలితముగా ఒక క్రొత్త వాతావరణములో క్రొత్త జీవితమేర్పడును. అందువలన క్రొత్తజన్మ ఒకని క్రొత్త స్థితిలోనికి, క్రొత్త వాతావరణములోనికి అనగా దేవుని రాజ్యములోనికి తెచ్చును. పౌలు ఇట్లనెను: "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి. పాతవి గతించెను. ఇదిగో సమస్తమును క్రొత్తవాయెను" (2 కొరింథి 5:17).

క్రీస్తులో నున్నవాడు నూతనసృష్టి గనుక, అతడు క్రీస్తులో ప్రవేశించునపుడొక క్రొత్త జీవితములో ప్రవేశించును. అయితే ఒకడు క్రీస్తులో ఎప్పుడు ప్రవేశించును? బాప్తిస్మముద్వారా ప్రవేశించునని బైబిలు బోధించుచున్నది. "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరమును ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?" (రోమా 6:3), "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:27).

ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందునని, క్రీస్తునందున్న యతడు నూతన సృష్టియని బైబిలు బోధించుచున్నది. ఒకడు క్రీస్తులోనికి ప్రవేశించువరకు నూతన సృష్టికాడు. అతడు ఆయనలోనికి బాప్తిస్మము పొందువరకు క్రీస్తులో యుండనేరడు. ఈ సమయమందు ఒకడు నూతన జీవము పొంది నడచుకొనునట్లు లేపబడును గాని దానికి ముందుకాదు. నీటి బాప్తిస్మము నుండి కలుగు పునరుత్థానము వెంబడి నూతన జీవితము ఆరంభమగును (రోమా 6 : 4).

సువార్త ప్రకటింపబడగా ఒకడు దాని విశ్వసించినప్పుడు జీవము ఆరంభమగును; అప్పుడు మారుమనస్సు నొందిన విశ్వాసి క్రీస్తులోనికి బాప్తిస్మము పొందును. క్రీస్తులో మాత్రమే ఈ క్రొత్త జీవితము అనుభవించును. అందువలన బాప్తిస్మము క్రొత్తజన్మలో ఒక భాగ మని బైబిలు బోధించుచున్నది. క్రొత్త జన్మవలన క్రొత్త జీవితము కలుగును. ఒకడు బాప్తిస్మపు సమాధి నుండి బయటకు రాగా అతడు క్రీస్తునందు జన్మించిన ఒక క్రొత్త శిశువు; అతడు నీటిమూలముగాను, ఆత్మ మూలముగాను జన్మించినవాడు.

తిరిగి జన్మించుటలో ఒకడు సాతానుయొక్క రాజ్యము నుండి క్రీస్తుయొక్క రాజ్యములోనికి మార్చబడును; అప్పుడు అతనికి పాప క్షమాపణ దొరుకును (కొలస్స 1:13, 14). యోహాను 3:5 లో చెప్ప బడిన నీటి మూలముగాను ఆత్మమూలముగాను కలుగు జన్మవలన ఒకడు లోకము నుండి సంఘములోనికి, అంధకార సంబంధమైన రాజ్య ములో నుండి దేవుని ప్రియ కుమారుని రాజ్యములోనికి మార్చ బడును. దేవుని కుమారునిగా అగు విధాన మంతయు క్రొత్తజన్మలో యిమిడి యున్నది. సులభముగా చెప్పకొనవలెనంటే తిరిగి జన్మించుట యనగా క్రైస్తవు డగుట యని అర్థము. (సశేషము)

---

## ఎదురు చూస్తున్నాను

"నా శరీరము నిజమైన ఆహారమును, నా రక్తము నిజమైన పానము నై యున్నది" (యోహాను 6:55).

ఎదురు చూస్తున్నాను నిదుర లేకుండ, ప్రభు బల్ల కోసం.
హృదయ ద్వారము తెరచి, పాపాన్ని మరచి, ప్రభురాత్రిభోజనంకోసం.
నీదు మరణవేదనలు జ్ఞాపకముంచుటకోసం, ప్రభూ.
నూతన జీవితపు వెల్గులో, నే నడుచుకొనుటకోసం.
నీవు వచ్చువరకు, ఈ దినం ప్రచురింప జ్ఞాపకార్థంకోసం.

ప్రభూ, ఈ కాలం ఉరవడిలో, నన్ను నేను పరీక్షించుటకోసం
ప్రభూ, క్రొత్తదన బ్రిదుకు కావాలనే కాంతి, రక్షణకోసం
ప్రభూ, వేదనతో ఆ తరుణంకోసం ఎదురు చూస్తున్నాను.
ప్రభూ, నీ కరుణ వాతావరణ కిరణాలకోసం
ప్రభూ, ఆత్మరక్షణ సంపాదనకోసం ఎదురు చూస్తున్నాను.
ప్రభూ, ప్రతిజ్ఞ చేసాను, ఆ కార్యసాధనకోసం.
సోపానాలపై అలసట దీర్చాను, స్వశక్తితో నాకోసం.
ఇపుడు బాప్తిస్మము పొందాను. అందుకున్నా నాశక్తి నాకోసం.
ఆనాడు బ్రిదికియు బ్రిద్దలై పోయాను, నిత్యజీవంకోసం.
ఇపుడు క్రీస్తునందున్నాను, అప్పుడను, ఆ యానందంకోసం.
నీ శరీరం తిని, నీ రక్తం త్రాగి, నిత్యం జీవించుటకోసం.
నీ శరీరం తిని, నీ రక్తం త్రాగి, నీయందుండుటకోసం.
ఆజ్ఞ పొందాను ప్రభువల్ల జ్ఞాపకముంచమన్న బల్ల.
చేర్చావు సంఘంలో నీవు ప్రభూ, నన్ను బాప్తిస్మంవల్ల.
ఎదురు చూస్తున్నాను ప్రతి ఆదివారం, రొట్టె రసం కోసం.
ఎదురు చూస్తున్నాను మతశాఖలవారి ఈ మార్పుకోసం.
ఎదురు చూస్తున్నాను వాక్యానుసారమైన నడవడికోసం.
ఎదురు చూస్తున్నాను నీ నూతన కాంతికోసం.
ఎదురు చూస్తున్నాను అంత్యదినమున లేచుటకోసం.
ఇదే నా ఎదురుచూపు, యేసు రక్షకుడు, భాగ్యశీలుని వైపు.
ఇదే నా చూపు. ఆయన వచ్చువరకు మరణము ప్రచురించుటకు.

— ఎ. ఇశ్రాయేలురాజు, కాకినాడ-2.

---

## సంఘ ఐక్యత

నేటి దినాలలో కొందరు మతనాయకులు ప్రసంగీకులు వారి వారి సంఘ సిద్ధాంతములను సంస్థల పనియొక్క తీరును ఆడంబరముగా

ప్రకటించుకొనుచూ ఒకరికి ఒకరు పోత్తు కుదుర్చక, కరచుకొను చున్నారు.

దాని ఫలితము ఎంత విచారము. సంఘ ఐక్యత కొరకు రక్షకు డైన క్రీస్తు ప్రార్థించిన విధమును నమ్మినవారైతే ఇన్ని మతశాఖలు ఉద్భవించక పోవును.

ప్రియ చదువరులారా ఈ లేఖన భాగములను చదవండి, బైబిలు తెరవండి:

యోహాను 17 : 20, 21 మరియు

ఫిలిప్పీ 3 : 17-19 చదవండి.

అపొస్తలుల బోధవలన ఏకమై యుండవలెనని క్రీస్తు ఆజ్ఞాపించిన దైవాధికారమును బట్టి, ఆత్మకలిగించు ఐక్యత కాపాడుకొనుటలో ఏకత్వము కలిగి వుండవలెను (ఎఫెసి 4:1, 4-6). దేవుని రాజ్యమైన క్రీస్తు తిన్నని మార్గమును చెడగొట్టుట మాని నిశ్చలమైన క్రీస్తు రాజ్యములో దైవకృప కలిగి యుందము.

క్రీస్తు సువార్తను విని, విశ్వసించి మారుమనస్సు పొంది పాప క్షమాపణ కొరకు బాప్తిస్మం పొంది దైవిక సంస్థయైన క్రీస్తు సంఘ సభ్యులగుటకు నిశ్చయించుకొనండి.

—R. సమూయేలు, అమలాపురం.

---

## ఏ డినామినేషన్?

## ( *What Denomination ?* )

పేతురు, యాకోబు, యోహాను, పౌలు, సీలా, తిమోతి, లూదియ మొదలగువారు ఏ డినామినేషన్‌కు చెందినవారు? బైబిలు జవాబు: దేనికీ కాదు! వారందరు క్రైస్తవులు మాత్రమే. క్రీస్తు ఆత్మీయ శరీరమై ఆయన సంఘమని, రాజ్యమని పిలువబడు దానిలో వారందరు సభ్యులు.

డినామినేషన్లు తరువాత ఎప్పుడో ఆరంభమైనవి. 16వ శతాబ్దములో ప్రొటెస్టాంటు సవరణోద్యమ కాలం నుండి అవి ఉద్భవింప మొదలిడినవి. క్రీస్తు అపొస్తలుల పవిత్రమైన ఆదిమ క్రైస్తవ్యము నుండి పతనమై పోయినందున కలిగిన ప్రతిక్రియ అది.

ఏ డినామినేషన్‌కు చెందకుండా స్త్రీ పురుషులు ఈనాడు క్రైస్తవులుగా మాత్రం యుండలేరా? డినామినేషన్లను వాటి మానవ కల్పిత విశ్వాస ప్రమాణములను, ఆర్గనైజేషన్లను, శాఖల పద్ధతులను విసనాడినట్టియు, విసనాడచున్నట్టియు క్రీస్తునందలి విశ్వాసులు ఈనాడు లక్షలకొలది యున్నారు. వారందరు పవిత్ర క్రొత్త నిబంధన క్రైస్తవ్య పునరుద్ధరణ ఉద్యమమై యున్నారు.

ఇది క్రీస్తుసంఘము యొక్క ప్రాథమిక విజ్ఞాపన. కొందరను కొనుచున్నట్లుగా ఇదియే సరియైన డినామినేషన్ అనేది మా విజ్ఞాపన కాదు. ఇదొక డినామినేషన్ కాదు గాని క్రీస్తు స్థాపించిన సంఘము! దేవుని వాక్యంలో బయలు పర్చబడిన జ్ఞానమునందును, శక్తియందును మా విశ్వాసమున్నది. సర్వసమృద్ధియైన క్రొత్త నిబంధన సంకల్పమునే మేము విశ్వసించుదుము.

క్రీస్తునందలి విశ్వాసులందరు ఏకమై యుండాలని మా ప్రార్థన. ఆయన దానికొరకు ప్రార్థించాడు (యోహాను 17:20-21). క్రీస్తుకును ఆయన బోధకును సంపూర్ణముగా సమర్పించుకొంటేనే ఆ ఐక్యత సాధ్యమౌతుంది!!

—జీన్ ఓవర్టన్.

---

## మాదిరి జీవితము

— P. ప్రకాశము, హైదరాబాద్.

నీ యౌవనమునుబట్టి ఎవడును నిన్ను తృణీకరింప నియ్యకుము. కాని మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను, విశ్వాసులకు మాదిరిగా ఉండుము (1 తిమో. 4:12).

ఈ మాటలు పౌలు తిమోతికి వ్రాయుచున్నాడు. క్రైస్తవ బోధకుని జీవితము, క్రైస్తవుని జీవితము, ఇతరులకు విశ్వాసులకు మాదిరిగా ఉండవలెనని వ్రాయుచున్నాడు. విశ్వాసులందరికి మనము మాదిరిగా ఉన్నామా? ఒక క్రైస్తవుని చూచినవారు క్రైస్తవు లందరు ఈలాగునే ఉందురని గ్రహించులాగున మాదిరి జీవితమును కలిగి యుండవలెను.

మామిడిపండ్లు గాని, నారింజపండ్లు గాని అమ్మేవారు ఒక కాయను మచ్చుగా చూపించెదరు. అనగా ఆ కాయ రుచినిబట్టి అన్ని కాయలు అట్లే ఉండునని వారు నమ్మించెదరు.

ఆలాగే నిన్ను చూచినవాడు నీ వెనుకఉన్న సంఘము కూడ ఆలాంటిదని నమ్మునట్లుగా మాదిరిగా జీవించవలెను.

**Example** అనియు **Ensample** అనియు రెండు పదములు గలవు. అనగా సాంపుల్ మచ్చు, **Example** మాదిరి జీవితము కల వారమై యుండవలెను. బోధకులకంటె విశ్వాసులైన సామాన్య క్రైస్తవులే విశ్వాసముతో జీవించుట చూడగలము. ఏయే విషయము లలో మనము మాదిరిగా ఉండవలెనో పై వాక్యమువలన మనము తేటగా గ్రహించుకొనగలము.

## మా ట లో మా ది రి

మత్తయి సువార్త 12:37 లో ప్రభువు చెప్పినది: నీ మాటలను బట్టి నీతిమంతుడవని తీర్పు నొందుదువు - నీ మాటలను బట్టియే అప రాధివని తీర్పు నొందుదువు. మాటలలో ఎన్ని తప్పులు, మాటల వలన ఎంత కీడు కలుగుచున్నది! బైబిలులో నాలుకనుగూర్చి చెప్ప బడిన మాటలు చాల కఠినముగా ఉన్నవి.

యాకోబు 3:6 లో నాలుక అగ్నియే. నాలుక మన అవయవ ములలో ఉంచబడిన పాపప్రపంచమై సర్వశరీరమునకు మాలిన్యము

కలుగజేయుచు, ప్రకృతి చక్రమునకు చిచ్చు పెట్టును. అది నరకము చేత చిచ్చు పెట్టబడును.

సాతానుతో సహా నరకమునకు పోయేది నాలుక. నాలుక అనగా సాతాను యొక్క సాధనము. గనుకనే సాతానుతో అగ్నిలో కాల్చ బడుటకు పోవును. గనుక మనము నాలుకనుగూర్చి జాగ్రత్తపడవలెను.

నాలుక : రోమా 3:13-14 వారి గొంతుక తెరచిన సమాధి. తమ నాలుకతో మోసము చేయుదురు. వారి పెదవులక్రింద సర్ప విషమున్నది. వారి నోటినిండ శపించుట పగయు ఉన్నవి.

దేవుడు మనకు నాలుకను "భాషను" ఆయనను మహిమ పర చుటకై ఇచ్చినాడు. మానవుడు దినమునకు సరాసరి 60,000 మాటలు మాట్లాడునని అంచనా వేయబడినది - మత్తయి 12:36. నేను మీతో చెప్పున దేమనగా మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసి యుండును. నాలుకతో మనము మాటలాడునపుడు—

## (A) నమ్మకముగా మాట్లాడుచున్నామా ?

లోలోపట కపట ముంచుకొని సహోదరులతో వంచనగా మాట్లాడుట పైకి హాలో హాలో, లోపల చెలో, చెలో అని కపట ముగా మాట్లాడుట. యిర్మీయా 9 : 8, వంచనగా మాట్లాడుట కపట మైన మాటలు పలుకకుండా నీ పెదవులను కాచుకొనుము. కీర్త 34:13 మోసకరమైన నాలుక. కీర్త 120:2.

## (B) సత్యము చెప్పుచున్నామా ?

కల్లలాడు నాలుక యెహోవాకు హేయము. సామె 6:17; కీర్తన 12:2. సాతాను యొక్క ముఖ్య లక్షణము అబద్ధమాడుట - వాడు అబద్ధికుడు - అబద్ధములు చెప్పువారు సాతాను సంబంధులు. చిన్న లాభము కొరకు లేక చిన్న శిక్షనుండి తప్పించుకొనుటకు సులు

వుగా అబద్ధములు చెప్పుదురు. అయితే ప్రకటన 21:8 లో చెప్పబడిన మాట చాల కఠినమై యున్నది.

ప్రకటన 21:8. అబద్ధికులందరును అగ్నిగంధకములతో మండు గుండములో పాలు పొందుదురు. ఇది రెండవ మరణము.

## (C) ప్రేమ గల మాటలు పలుకుచున్నామా ?

వారి నోటిమాటలు వెన్నవలె మృదువుగా ఉన్నవి - అయితే వారి హృదయములో కలహ మున్నది - వారి మాటలు చమురుకంటె నునుపైనవి - అయితే అవి వరదీసిన కత్తులే - నాలుక ఘాతుక బాణము (యిర్మి 9:8), వాడిగల మంగలికత్తె (కీర్తన 52:2), వాడి గల కత్తె (కీర్తన 52:4). నాగుపాము నాలుక, కట్లపాము విషము వీనికి పోల్చబడినది. గనుక మనము మాట్లాడునప్పుడు ప్రేమగల మాటలు పలుకునట్లు మన హృదయములో నుండి ప్రేమగల మాటలు మన నోటిద్వారా వచ్చునట్లు మన మాటలు ఉండవలెను - కొందరు చాల ప్రేమగల మాటలు పలుకుదురుగాని వారి హృదయములో ప్రేమ ఉండదు. అది ప్రజలు గ్రహించగలరు

## (D) నోటితో పరిశుద్ధమైన మాటలు పలుకుచున్నామా ?

ఎఫెసి 5:3. మీలో జారత్వమేగాని యేవిధమైన అపవిత్రత యేగాని, లోభత్వమేగాని వీటి పేరైనను ఎత్తకూడదు.

ఇదే పరిశుద్ధులకు తగినది-మరియు కృతజ్ఞతావచనమే మీరు ఉచ్చరించవలెనుగాని మీరు బూతులైనను, పోకిరి మాటలైనను, సరసోక్తులైనను ఉచ్ఛరించకూడదు.

మన మాటలలో పరిశుద్ధత ఉన్నదా ? పరిశుద్ధమైన మాటలు పలుకుచున్నామా ?

## (E) నాలుకతో చాడీలు చెప్పుచున్నామా ?

ఎవరికిని చెప్పవద్దని ఒకరితో చెప్పిన మాట అందరికి చెప్పుట - నీ స్నేహితుడు తన రహస్యములను నీతో చెప్పుకొన్నపుడు అతని

జరిగిన కష్టము నష్టము నీతో చెప్పినపుడు - నీ స్నేహితుని గుట్టు నీవు దాచగలవా? చాడీలు చెప్పి ఇతరులవలన లాభము పొంది కొందరికి చేటు కలుగజేయువారిని ఎవరును నమ్మరు. Back biting tongue కొండెగాని నాలుక క్రోధదృష్టి కలిగించును - కొండెగానివలన అనేకులు మంచివారు చెడుట మాత్రమే గాక అతడు కూడ చెడి పోవును. గాన మన నాలుకతో కొండెములు ప్రచురించరాదు. 1 పేతురు 3:10 జీవమును ప్రేమించి మంచి దినములు చూడగోరు వాడు చెడ్డదాని పలుకకుండ తన నాలుకను, కపటపు మాటలు చెప్ప కుండ తన పెదవులను కాచుకొనవలెను.

మాటల విషయములో మన ప్రభువు మాదిరిని
మనము చూడగలము-

లూకా 4:22 అప్పుడందరును ఆయననుగూర్చి సాక్ష్యమిచ్చుచు ఆయన నోటనుండి వచ్చిన దయగల మాటల కాశ్చర్యపడిరి.

మత్తయి 13:54, మార్కు 6:2.

యోహాను 7:46. ఆ బంట్రోతులు - ఆ మనుష్యుడు మాట్లాడి నట్లు ఎవడును ఎన్నడును మాటలాడ లేదనిరి.

యోహాను 6:68. సీమోను పేతురు ప్రభువా యెవని యొద్దకు వెళ్లుదుము? నీవే నిత్యజీవపు మాటలు గలవాడవనెను - ప్రభువు నోటితో ఎన్నడు ఒక వ్యర్థమైన మాట పలుకలేదు.

## ప్ర వ ర్త న లో - మా ది రి

ప్రవర్తన అనగా జీవనవర్తనమంతయూ (Whole manner of life). మనము చెప్పేది కాదు, మనము చేసేది. మనము చెప్పేది వినబడేదానికంటె మనమేమై యున్నామో అది గట్టిగా వినబడు చున్నది. పరిశుద్ధులుగా ఉండాలని మనము చెప్పేది సులువుగాని, పరి శుద్ధులుగా ఉండి చూపించేది అంత సులువు కాదు. పరిశుద్ధులుగా జీవించి చూపించుట అవసరము.

మత్త 5:16 - మనుష్యులు మీ సత్క్రియలను చూచి లోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి.

పౌలు చెప్పినది - 1 కొరింథి 11:1. నేను క్రీస్తును పోలి నడ కొన్న ప్రకారము మీరు నన్ను పోలి నడుచుకొనుడి. మన చూపించవలసిన మాదిరి ప్రవర్తన ఇది. పౌలువలె మనమును చెప్ప వారమై యుండవలెను. మనలను చూచి ఇతరులు తమ ప్రవర్తన సరిచూచుకొనునట్లు మనము లోకమునకు వెలుగుగాను, ఉప్పువలె ఉన్నామని ప్రభువు చెప్పెను.

యోహాను 8:12 - నేను లోకమునకు వెలుగై యున్నాను నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు గలవా యుండునని యేసు చెప్పెను. (సశేషము

---

## క్షమాపణ
## *( Forgiveness )*

మన ప్రభువైన క్రీస్తు సిలువపై వ్రేలాడుచు తన్ను హింసిం వారిని గూర్చి, "తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గను వీరిని క్షమించుమని చెప్పెను" (లూకా 23:34). ప్రభువు ప్రార్థన చెప్పబడు దానిలో, "మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్ర రము మా ఋణములు క్షమించుము" అను మాటలను ఆయ నేర్పాడు (మత్తయి 6:12). ప్రభువు మనల్ని క్షమించాలని కో చున్నట్లయితే క్రైస్తవులమైన మనం ఒకరినొకరు క్షమించాలి.

ఒక్కొసారి క్రైస్తవులనబడే వారే యితరులపై గొప్ప బూని యున్నట్లగపడుచు యుంటాది. పరులయెడల దుస్స్వభావము ద్వేషము కలిగి వారే మనల్ని అపార్థము చేసుకొనుచున్నారని కొనుట కద్దు.

క్షమించుడి యని ప్రభువు మనకు నేర్పాడు. నిజమే, మన యెడల తప్పిదము చేసినవారు దాన్ని ఒప్పుకొని క్షమాపణ నడగాలి. డెబ్బై యేడు మారుల మట్టుకు మనం క్షమించాలని ప్రభువు మనకు నేర్పలేదా? ఎలాగయినా మనం నిత్యం పగబూని యుండడం మనకు మంచిది కానే కాదు.

ప్రేమించుటకు, క్షమించుటకు మనం నేర్చుకొందము. మనం అనుకోకుండగానే యితరులను గాయపరచి యుంటామన్న సంగతి మరచిపోవద్దు. దాన్ని గూర్చి కూడా మనం మరచిపోయి యుండ వచ్చును. గాని గాయపరచబడిన వారు మనయెడల ఎల్లప్పుడు కోపంగా యుండాలని మనం అనుకోముగదా. అవును, మనమే ఎక్కువ క్షమింపబడాలి.

ఘోర పాపియైనవాడు మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందితే ప్రభువు వానిని క్షమించును (అపొ.కా. 2:38). దేవుని పిల్లలు తమ పాపములను ఒప్పుకొనుచు తమయెడల అపరాధము జరిగించిన వారిని క్షమించుచు యున్న యెడల ప్రభువు వారిని క్షమించును. విద్వేషపూరిత హృదయం, క్షమించలేని హృదయం నిజంగా ఘోరమైనది!

R.J. బోనర్.

---

## నీవు నశించిపోయావా?

### (Are You Lost?)

నశించిన దానిని వెదకి రక్షించుటకు యేసు వచ్చెనని క్రొత్త నిబంధనలో విపులముగా చెప్పబడినది. దీనిని బట్టి మానవుడు నిజంగా నశించిన వాడని గ్రహింపగుచున్నది. నశించుట అంటే యేమిటో దాన్ని మనం గ్రహించుకోలేక పోయామని నేనను కొనుచున్నాను.

### దేవుని నుండి వేరుచేయబడుట

నశించిన వారు దేవుని నుండి, ఆయన సహవాసమునుండి వేరు

చేయబడిన వారని మనం మొదట గ్రహించాలి. పూర్వకాల ప్రవ
యిట్లు చెప్పాడు: "మీ దోషములు మీకును మీ దేవునికిని అ
ముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరు
పరచెను గనుక ఆయన ఆలకింపకున్నాడు" (యెషయా 59:1, 2)
నిజంగా నశించిన స్థితిని వర్ణించుట మనకు సాధ్యం కాకపోవచ్చును
దేవుని నుండి వేరై పోవడం ఎంత ఘోరమో గదా. "ప్రభువు వచ్చి
నప్పుడు అట్టివారు ఆయన సముఖమునుండియు, ఆయన ప్రభావమంద
మహిమనుండియు పారదోలబడి నిత్యనాశనమను దండన పొందుదురు
అని పౌలు చెప్పాడు (2 థెస్స 1:10).

## పాపములో నశించుట

నశించినవారు పాపములో నశించియున్నారని మనం గ్రహి
చాలి. మానవుడు దేవుని చిత్తాన్నయినా జరిగిస్తాడు లేదా అపవా
చిత్తాన్నయినా జరిగిస్తాడు. అతడు ఇద్దరిని సేవించలేడు. "అతడు ఒక
ద్వేషించి యొకని ప్రేమించును; లేదా యొకని పక్షముగా ను
యొకని తృణీకరించును" (మత్త 6:24). గనుక దేవునికి వ్యతిరేకులై
వారు అపవాదిని సేవించుచున్నారు. వారు నిత్యనరకంలో బడినప్పు
తమ పాపు పర్యవసానాన్ని గుర్తించుదురు.

## నిరుపయోగపరులగుట

నశించినవారు అటు దేవునికి, ఇటు మానవునికికూడ నిరు
యోగ పరులగుదురు. యెవడును పాపములో జీవించుచు ప్రయో
కరమైన జీవితాన్ని జీవించలేడు. అతడు మానవజాతికి ప్రయోజనక
కాడు గనుక దేవునికి కూడ పనికిరాడు. అతడు భౌతిక మార్గా
మానవజాతికి సేవజేసినట్లగుపడునేమో గాని అది తాత్కాలికమే.

ఒకడు దేవునినుండి వేరై పాపములోబడి నశించినప్పు
ఏకాకియై నిరీక్షణ రహితుడగును. మరణం సంభవించినప్పుడు
లోక నిరీక్షణ యేదీ లేకుండా మరణించును. క్రీస్తు మానవుని రక్షి
డానికి వచ్చాడు గనుక ఏ మానవుడు నశించనక్కరలేదు. సువా
విధేయుడవుకమ్ము! రక్షింపబడుము !!

— ఫ్రెడ్ వా

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# పరివర్తన

నీ మార్గం వీడి నిన్ను మరచి
పాప పంకిలపు లోయల్లో
కూరుకు పోతున్నప్పుడు

ఇహలోక వాంఛలందు జీవితం
నిశ్శబ్ద నిశీధిలో శ్మశాన వాటికలా
చితికి శిథిలమౌతున్నప్పుడు

అనంత అగాధాల్లో, గాఢాంధకార లోయల్లో
స్వనీతి లోకంలో విహరిస్తూ
వికటాట్టహాసం చేస్తున్నప్పుడు

మరణాంధకార మార్గాన్వేషణలో
భుజస్కందాలపై శోధకుడు
తాండవమభినయిస్తున్నప్పుడు

నీ కరుణా కటాక్ష వీక్షణములు సారించి
మమ్ము ప్రేమించి
దయచూపించి, భువికేతెంచి

నీవు చిందించిన
పరిశుద్ధ రక్తాభిషేకముతో
మమ్ము శుద్ధులు చేసి

మా ఆత్మాభిరేఖకు
నీ వాక్యంపు వెలుగును చూపిన
జ్యోతిర్మయుడా, జీవనదాత

ఈ అడవి పూవు జీవితాన్ని
నీ పాదపూజకు కొనివచ్చితిని
గైకొనవా ప్రభూ!

— బెంజిమిన్ గూటం
కాకినాడ-4

# ప్రేమ దీర్ఘకాలము సహించును

ప్రేమ సహించును. శుభ సమయములందు అశుభసమయములందు ప్రభువుపై ఆనుకొని అది దీర్ఘకాలము సహించును.

"ఇకను ఏమి చెప్పుదును? గిద్యోను, బారాకు, సమ్సోను, యెఫ్తా, దావీదు, సమూయేలను వారిని గూర్చియు, ప్రవక్తలను గూర్చియు వివరించుటకు సమయము చాలదు. వారు విశ్వాసము ద్వారా రాజ్యములను జయించిరి, సింహముల నోళ్ళను మూసిరి, అగ్ని బలమును చల్లార్చిరి, ఖడ్గధారను తప్పించుకొనిరి. మరి కొందరు తిరస్కారములను, కొరడా దెబ్బలను, బంధకములను, ఖైదులను అనుభవించిరి. రాళ్ళతో కొట్టబడిరి, రంపములతో కోయబడిరి, శోధింపబడిరి...దరిద్రులై యుండి శ్రమపడి హింస పొందుచు...సంచరించిరి. "ఇంత గొప్ప సాక్షిసమూహము మేఘమువలె మనలను ఆవరించి యున్నందున మనము కూడ ప్రతిభారమును సుళువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి...యేసు వైపు చూచుచు...ఓపికతో పరుగెత్తుదము. ఆయన...సిలువను సహించి దేవుని...కుడి పార్శ్వమున ఆసీనుడై యున్నాడు. మీరు అలసటపడకయు మీ ప్రాణములు విసుకయు ఉండునట్లు పాపాత్ములు తనకు వ్యతిరేకముగ చేసిన తిరస్కారమంతయు ఓర్చుకొనిన ఆయనను తలంచుకొనుడి" (హెబ్రీ11:32-12:3)

---

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

To

..................................

..................................

..................................

..................................